

అర్జీలకు సత్వర పరిష్కారం

కలెక్టర్ పి.బసంత్ కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

నిర్దేశిత గడువులోగా స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ పి.బసంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. పుట్టపర్తి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ఉదయం నిర్వహించిన స్పందన (గ్రీవెన్స్) కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ కొండయ్య, ఆర్డీవో భాగ్యరేఖ, వివిధ శాఖల అధికారులు ప్రజల నుంచి 121 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కార వేదికైన స్పందనలో వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించడం అత్యంత ముఖ్యమన్నారు. అర్జీదారుడికి సంతృప్తి కలిగేలా పరిష్కారం చూపించాలని, ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపించడం కీలకమన్నారు. స్పందన గ్రీవెన్స్ అర్జీల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదన్నారు. ఏ అర్జీ కూడా రీఓపెనింగ్‌కి ఆస్కారం లేనివిధంగా నాణ్యత కలిగిన పరిష్కారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

215 మంది విద్యార్థులు గైర్హాజరు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లా వ్యాప్తంగా పది పరీక్షలు మొదలయ్యాయి. సోమవారం నాడు జరిగిన తెలుగు మొదటి పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా 225 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 23,128 విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 22,913 మంది హాజరయ్యారు. 215 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించామని డిఇఒ మీనాక్షి తెలిపారు. పుట్టపర్తి, ఎనుములపల్లి జడ్పిహెచ్, ఎస్ఎస్ఎస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, బ్రాహ్మణపల్లి వద్దనున్న వారధి పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను కలెక్టర్ బసంత్‌కుమార్ తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో అవసరమైన తాగునీరు, విద్యుత్ సరఫరా, తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని సిబ్బందికి ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎంఇఒ వెంకట రమణ నాయక్, తదితరులు ఉన్నారు.

పరీక్షలు రాసిన అంధ విద్యార్థులు

అనంతపురం : అనంతపురం జిల్లాలో ఆరుగురు అంధ విద్యార్థులు ఎవరి సహకారం లేకుండా వారి ల్యాప్ ట్యాప్‌ల ద్వారా వారే స్వయంగా పరీక్ష రాశారు. రాష్ట్రంలోనే తొలిసారి అంధ విద్యార్థులు ఇలా పరీక్షలు రాశారు. రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన తెలుగు పరీక్షలో వీరు ల్యాప్‌ట్యాప్ ద్వారా పరీక్ష రాశారు. ఈ విద్యార్థులు అంతా ఆర్డీటీ ఇన్లీవ్‌జీవ్ పాఠశాలల్లో చదువుతున్నారు.



హిందూపురంలో పరీక్ష కేంద్రం వద్ద నెంబర్ చూసుకుంటున్న విద్యార్థులు

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



మృతి చెందిన విద్యార్థి వంశీ(ఫైల్ ఫొటో)

ఉరవకొండ రూరల్ : పది పరీక్షలు రాసే పరీక్షా కేంద్రాన్ని చూసేందుకు వెళ్తున్న రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి చెందిన సంఘటన అనంతపురం జిల్లా విడపనకల్లు మండల కేంద్రంలోని మోడల్ హైస్కూల్ సమీపంలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... విడపనకల్లు మండల పరిధిలోని హావలిగి గ్రామానికి చెందిన కె.వంశీ(17), జి.మల్లికార్జునలు పది సప్లిమెంటరీ పరీక్షలు రాస్తున్నారు. ఇందులో భాగంగా వీరు పరీక్ష రాయనున్న విడపనకల్లు మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రాన్ని చూసేందుకు సోమవారం నాడు స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. మోడల్ స్కూల్ వద్దకు రాగానే ద్విచక్రవాహనం ఎదురుగా వస్తున్న కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో వంశీ, మల్లికార్జనలు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు వారిని చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం వంశీని బెంగళూరుకు, మల్లికార్జునను తిరుపతికి తరలించారు. బెంగుళూరులో చికిత్స పొందుతూ వంశీ మృతి చెందాడు. ప్రమాదం విషయం తెలుసుకున్న విడపనకల్లు మండల జెసిఎస్ కన్వీనర్ భరత్ రెడ్డి, హవలిగి సర్పంచి రఘురాములు, ఎంపీటీసీ రాజశేఖర్, మండల విద్యాశాఖ అధికారి ప్రభావతమ్మ అనంతపురంలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు.



పరీక్ష కేంద్రానికి కుమారున్ని మోసుకుని తీసుకొచ్చిన తల్లి

అమ్మతోడుగా.. పరీక్ష రాయగా..!

పుట్లూరు : నడవలేని స్థితిలో ఉన్న కుమారున్ని ఎత్తుకుని పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లి ఓ తల్లి పది పరీక్షలను రాయించింది. అనంతపురం జిల్లా పుట్లూరు మండలం కడవకల్లు గ్రామానికి చెందిన భరత్ కుమార్‌రెడ్డి వికలాంగుడు. కడవకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈయన 10వ తరగతి చదివాడు. ఇతను పది పరీక్షలను పుట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాయాల్సి ఉంది. కడవకల్లు గ్రామం నుంచి ఈ కేంద్రం ఎనిమిది కిలోమీటర్ల దూరం ఉంది. నడవలేని స్థితిలో ఉన్న కుమారున్ని విద్యార్థి తల్లి మునెమ్మ తన చేతులు మీద మోసుకెళ్లి పరీక్షా కేంద్రంలో కూర్చొబెట్టింది. పరీక్షల అనంతరం ఆమె మళ్లీ కుమారున్ని చేతలపై ఎత్తుకుని కేంద్రం నుంచి బయటకు తీసుకెళ్లింది. వికలాంగుడైన ఆ విద్యార్థి పరీక్ష రాసేందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కుమారుని భవిష్యత్తు కోసం ఆతల్లి చూపిన ప్రేమను పలువురు అభినందించారు.

గాయాలతోనే పరీక్ష రాసి..



గాయపడి పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థి

హిందూపురం : ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ విద్యార్థి మరో విద్యార్థి సాయంతో పరీక్ష రాశాడు. శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... హిందూపురం పట్టణ పరిధిలోని ముదిరెడ్డిపల్లి జిల్లా ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థి ముఖేష్ గత నెల 26వ తేదీన పాఠశాలలో సరస్వతి పూజా కార్యక్రమం పూర్తి చేసుకుని ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళుతుండగా ప్రమాదవాశత్తు కుక్క అడ్డు రావాడంతో అదపు తప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో విద్యార్థి తల, చేతులకు తీవ్రంగా దెబ్బలు తగిలాయి. విద్యార్థి పరిస్థితి విషమంగా ఉండడంతో తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం బెంగళూరుకు తీసుకెళ్లారు. అక్కడ వైద్య సేవలు పొందుతున్న విద్యార్థి ఎలాగైన పదవ తరగతి పరీక్షాలనే ఆకాంక్షను తల్లిదండ్రులకు తెలిపారు. తల్లిదండ్రులు విద్యార్థి సంఘ నాయకుడు అభిను సంప్రదించారు. అతను జిల్లా విద్యాశాఖ అధికారితో మాట్లాడారు. ప్రమాదంలో గాయపడి పరీక్ష రాయలేని స్థితిలో ఉన్న విద్యార్థికి మరో విద్యార్థినిని సాయంగా ఇచ్చారు. నేతాజీ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి పరీక్ష రాయగా ముఖేష్ సమాధానాల చెప్పాడు. తలకు తీవ్రంగా గాయం కావడంతో ముఖేష్ పరీక్షను పూర్తి స్థాయిలో రాయలేకపోయాడు.

మారిన ప్రశ్నాపత్రం

ఎనిమిది మంది ఇన్విజిలేటర్లు సస్పెన్షన్

అనంతపురం జిల్లాలో జరిగిన పదవ తరగతి పరీక్షల్లో మొదటి రోజు రెండు తప్పిదాలు జరిగాయి. అనంతపురం నగరంలోని రెండు పాఠశాలల్లో ఇద్దరు విద్యార్థులకు వేరువేరు ప్రశ్నాపత్రాలను ఇన్విజిలేటర్లు ఇచ్చారు. ఈ తప్పిదాన్ని అధికారులు ఆలస్యంగా గుర్తించారు. విద్యార్థుల, తల్లిదండ్రులు దీనిపై ఆందోళన చెందడటంతో ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి సాయిరామ్ హామీనిచ్చారు. దీనికి సంబంధించి వివరాలు ఈ విధంగా ఉన్నాయి. అనంతపురం నగరంలోని భాష్యం పాఠశాలలో పరీక్ష రాసిన నందిని అనే అమ్మాయి, సివిఆర్ పాఠశాలలో జశ్వంత్‌లకు ఫస్ట్ లాంగ్వేజ్ వంద మార్కుల ప్రశ్నాపత్రం ఇవ్వాల్సి ఉండగా 75 మార్కుల కంపోజిట్ ప్రశ్నాపత్రంను ఇన్విజిలేటర్లు ఇచ్చారు. సదరు విద్యార్థులు పరీక్ష రాసిన తరువాత ఈ విషయాన్ని గ్రహించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై విద్యాశాఖ అధికారులు ఆరా తీసి ఇన్విజిలేటర్ల అలసత్వం కారణంగా తప్పిదం జరిగిందని భావించి నాగవేణి, నాగభూషణం అనే ఇన్విజిలేటర్లను సస్పెండ్ చేశారు. అంతకు మునుపు పొట్టి శ్రీరాములు పాఠశాలను కలెక్టర్ నాగలక్ష్మి పరిశీలించి నప్పుడు విధులు సక్రమంగా నిర్వహించడం లేదని గ్రహించి ఇన్విజిలేటర్లు శివమ్మ, రాజన్న, గంగిరెడ్డిలను సస్పెండ్ చేశారు. ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి కూడా మొదటి రోజు అనంతపురం నగరంలో పొట్టిశ్రీరాములు, నేతాజీ పాఠశాలల్లోని పరీక్షా కేంద్రాలు తనిఖీ చేశారు. లోపాలను గ్రహించి బాబురావు, చిట్టంరెడ్డి, నాగరాజులను సస్పెండ్ చేశారు.



చెక్కు అందజేస్తున్న దృశ్యం

క్యాన్సర్ బాధితుడికి ఆర్థికసాయం

పరిగి : కొన్ని సంవత్సరాలుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ వైద్య సహాయం కోసం ఉన్న ఆస్తిని కోల్పోయి ఇబ్బందుల్లో ఉన్న వ్యక్తికి దివ్య ఎడ్యుకేషన్ ఛారిటబుల్ ట్రస్టు అధినేత వేణుగోపాల్‌రావు ఆర్థిక సాయం చేశారు. సోమవారం తన కుమార్తె దివ్య ఎనిమిదవ వర్ధంతి సందర్భంగా పరిగి మండల కేంద్రంలోని అంగన్వాడి కేంద్రాలలో విద్యార్థులకు బట్టలు, భోజన వసతి కల్పించారు. వేసవిలో అంగన్వాడీ విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గమనించి అంగన్వాడీ సెంటర్‌కు సీలింగ్ ఫ్యాన్ ను అందించారు. పరిగి మండలం కోనాపురానికి చెందిన నంజుండప్ప క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న నేపథ్యంలో మందులకు గాను రూ. 5వేల విలువ జేసే చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి లక్ష్మీదేవి శివశంకర్, ఎంపిటిసి తదితరులు పాల్గొన్నారు.

కుక్కల బెడద నుంచి కాపాడండి

బుక్కపట్నం : మండల కేంద్రంలో వీధి కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలని సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు వారు పార్టీ ఆధ్వర్యంలో తహశీల్దార్ నటరాజ్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి బ్యాల్ల అంజి మాట్లాడుతూ గ్రామంలో ప్రధాన వీధులలో వీధి కుక్కల వలన పిల్లలు, వృద్ధులు భయపడుతున్నారన్నారు. ప్రధానంగా చికెన్ సెంటర్లు, హోటళ్ల వద్ద కుక్కలు గుమికూడి ఉండడంతో పిల్లలు వృద్దులు రోడ్డు మీదకు వెళ్లాలంటేనే భయపడుతున్నారన్నారు. అధికారులు స్పందించాలని కోరారు.

5న ప్రాంగణ నియామకాలు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని శ్రీనివాస పీజీ అండ్ డిగ్రీ కళాశాలలో ఈనెల 5న వీవీకేర్ కంపెనీ ప్రతినిధులు క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ ముసలిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2019-20 మధ్య డిగ్రీ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. తెలుగురాష్ట్రాలతో పాటు కర్నాటక రాష్ట్రంలో కూడా ఉద్యోగం చేయాల్సి ఉంటుందన్నారు.

జగన్ రెండు బటన్ల సిఎం

- పది రూపాయలిచ్చి రూ.వంద లాగుతున్నాడు..
- ఎనిమిదిసార్లు విద్యుత్ ఛార్జీల పెంపు
- రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం
- యువగళం పాదయాత్రలో నారాలోకేష్



లోకేష్‌కు నాగళి బహూకరిస్తున్న టిడిపి నాయకులు, రైతులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, బత్తలపల్లి

జగన్ రెండు బటన్ల సిఎం అని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఎద్దేవా చేశారు. ఒక బటన్ నొక్కి పది రూపాయలు అకౌంట్లోకి వేస్తే మరో బటన్ నొక్కి రూ.100 అకౌంట్ నుంచి లాగేస్తున్నాడని విమర్శించారు. లోకేష్ యువగళం పాదయాత్ర సోమవారం 59వ రోజు బత్తలపల్లి మండలం ముష్టూరు క్రాస్ వద్ద ఏర్పాటు చేసిన విడిది కేంద్రం నుంచి సంజీవపురం, యర్రాయపల్లి, మన్నీల మీదుగా రాప్తాడు నియోజకవర్గంలోకి ప్రవేశించింది. రాప్తాడు నియోజకవర్గంలో మన్నీల క్రాస్, కృష్ణంరెడ్డిపల్లి, ఇటుకలపల్లి, ఎస్‌కె యూనివర్సిటీ మీదుగా పంగల్‌రోడ్డులోని విడిది కేంద్రం వరకు కొనసాగింది. ముష్టూరు వద్ద రైతులు, సంజీవపురంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ఎస్‌కెయులో విద్యార్థులతో మాట్లాడారు. ఆయా ప్రాంతాల్లో రైతులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, విద్యార్థులు లోకేష్ దృష్టికి పలు సమస్యలను తీసుకొచ్చారు. ఎస్‌కెయు వద్ద విద్యార్థి సంఘాల నాయకులు విశ్వవిద్యాలయ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గతంలో ఫ్యాక్షన్ హత్యకు గురైన తగరకుంట ప్రభాకర్ కుమార్తె శ్రావణిని లోకేష్‌ను కలిసింది. ప్రభాకర్ మృతి అనంతరం శ్రావణిని ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌లో చదివించారు. దీనికి శ్రావణి కృతజ్ఞతలు తెలిపింది. పాదయాత్ర సందర్భంగా పలుచోట్ల ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. సంక్షేమ ప్రభుత్వమని చెప్పుకునే వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక వంద పథకాలను రద్దు చేసాడని విమర్శించారు. బటన్ నొక్కి అకౌంట్‌లోకి పది రూపాయలు వస్తే, టేబుల్ కింద బటన్ నొక్కి వంద రూపాయలు బాదుడుతున్నాడన్నారు. రాష్ట్రంలో మద్యం అమ్మకాలను తగ్గిస్తామని అధికారంలోకి రాకముందు హామీని వైసిపి ఇచ్చిందని గుర్తు చేశారు. ఇప్పుడేమో మద్యం అమ్మకాలపై ఆదాయం చూపించి రూ.25 వేల కోట్లు అప్పు తెచ్చారని విమర్శించారు. దిశ చట్టం పెద్ద మోసమని దుయ్యబట్టారు. చట్టమే లేకుండా పోలీసు స్టేషన్లు ప్రారంభించారని తెలిపారు. వైసిపి నేతల దెబ్బకు రాష్ట్రానికి పరిశ్రమలు వచ్చే పరిస్థితి లేకుండాపోయిందని చెప్పారు. ఇక్కడ కూడా జాకీ పరిశ్రమ వచ్చి పోయిందని పేర్కొన్నారు. దీంతో ఆరువేల కుటుంబాలకు ఉపాధి లేకుండపోయిందని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వాలు మారినా పరిశ్రమలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండే చట్టాన్ని తీసుకొస్తామని చెప్పారు. తెలుగు రైతు అధ్యక్షులు చల్లా శ్రీనివాసులు నాయుడు, గంటాపురం జగ్గుల ఆధ్వర్యంలో పలువురు రైతులు రైతాంగ సమస్యలను లోకేష్ దష్టికి తీసుకువచ్చారు. వీటిపై లోకేష్ మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి రాగానే వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. మూడేళ్లుగా అతివష్టి, అకాల వర్షాల కారణంగా వేరుశనగ రైతులు తీవ్రంగా నష్టపోయిన ప్రభుత్వం పరిహారం ఇవ్వలేదన్నారు. సేకరించిన ధాన్యానికి సకాలంలో డబ్బు చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్నారని, క్రాప్ ఇన్సూరెన్స్, సబ్సిడీలు కేవలం 20శాతం మంది రైతులకు మాత్రమే అందుతున్నాయని చెప్పారు. రైతుల సమస్యలన్నింటినీ పరిష్కరించేలా అన్ని చర్యలూ తీసుకుంటామని హామీ ఇచ్చారు. మాజీ మంత్రి పరిటాల సునీత మాట్లాడుతూ జాకీ పరిశ్రమ పోకుండా ఉండాలని పోరాటం చేసిన వంద మంది మహిళలలపై ఈ ప్రభుత్వం కేసులు పెట్టిందని గుర్తు చేశారు. మహిళలకు తెలుగుదేశం ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, మాజీ ఎమ్మెల్సీ గండుమల తిప్పేస్వామి నాయకులు మదమంచి స్వరూప, బోయపాటి అప్పస్వామి నాయుడు, రాఘవంపల్లి శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు అనంతలో పర్యటన

రాప్తాడు నియోజకవర్గం పరిధిలో పాదయాత్ర నేడు ముగియనుంది. మంగళవారం ఉదయం నుంచి అనంతపురం నియోజకవర్గంలోకి యాత్ర ప్రారంభం కానుంది. భోజన విరామ సమయానికి విజయనగర కాలనీ వరకు యాత్ర సాగనుంది. అటు తరువాత సాయంత్రం నాలుగు గంటలకు అక్కడి నుంచి ప్రారంభమై సంగమేశ్ సర్కిల్, పవర్ ఆఫీసు, విజయ క్లాత్ సెంటర్ మీదుగా సప్తగిరి సర్కిల్ వరకు సాగనుంది. అక్కడి నుంచి అంబేద్కర్ సర్కిల్ మీదుగా రుద్రంపేట బైపాస్, కళ్యాణదుర్గం బైపాస్, బళ్లారి బైపాస్ మీదుగా ఎంవైఆర్ ఫంక్షన్ హాలుకు చేరుకోనుంది. రాత్రి పది గంటలకు అక్కడికి చేరుకుని బస చేస్తారు.



విద్యుత్‌స్తంభాన్ని నోటీసుబోర్డుగా ఉపయోగించిన దృశ్యం

అసౌకర్యాల నడుమ పదోతరగతి పరీక్షలు

సెల్ ఫోన్లతో విధులకు హాజరైన ఇన్విజిలేటర్లు
విద్యుత్ స్తంభాన్ని నోటీసు బోర్డుగా ఉపయోగించిన అధికారులు

ప్రజాశక్తి - మడకశిర

మడకశిర పట్టణంలో 10వ తరగతి పరీక్షలు అసౌకర్యాల నడుమ ప్రారంభమయ్యాయి. మడకశిర పట్టణంలో 5 పరీక్ష కేంద్రాలు, కదిరేపల్లి సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో రెండు పరీక్ష కేంద్రాలు మొత్తం ఏడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మడకశిర పట్టణంలోని సరస్వతీ విద్యా మందిరం పరీక్ష కేంద్రంలో విద్యార్థులను పరీక్ష రాయడానికి ఏ గదిలో కేటాయించారన్న వివరాలను నోటీసు బోర్డులో ప్రచురణ చేయాల్సుండగా అక్కడ నోటీస్ బోర్డ్ ఉన్న దానిని ఉపయోగించ లేదు. విద్యార్థులకు ఏ గదికి కేటాయించారన్న సమాచారాన్ని విద్యుత్ స్తంభానికి అతికించి చేతులు దులుపుకున్నారు. అదేవిధంగా ఈ పాఠశాలలో కొన్ని గదులలో సరైన సౌకర్యాలు లేవు. మాత ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో కొంతమంది ఇన్విజిలేటర్లు పరీక్ష కేంద్రానికి సెల్‌ఫోన్లు తీసుకెళ్లినట్లు విమర్శలున్నాయి. ఇదేమని అడిగితే తాము చీఫ్ సూపరిండెంట్ల వద్ద సెల్‌ఫోన్లను భద్రపరుస్తామని సమాధానమిచ్చారు. మండలంలో పదవ తరగతి తెలుగు పరీక్షను మొత్తం 1275 మంది విద్యార్థులు పరీక్షకు రాయవలసి ఉండగా 1263 మంది హాజరయ్యారు. పలు పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు సరైన గాలి వెలుతురు లేక ఇబ్బందులకు గురయ్యారు. తెలుగు పరీక్ష అసౌకర్యాల నడుమ ముగిసింది.

మహాధర్నాలో బత్తలపల్లి నాయకులు

బత్తలపల్లి : బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్, కురుబ కులాన్ని ఎస్టీల్లో చేర్చాలని డిమాండ్ చేస్తూ కురుబ సంఘం ఆధ్వర్యంలో ఢిల్లీలో చేపట్టిన మహాధర్నాలో ఏపీ కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు పాల్గొన్నారు. సోమవారం ఛలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన మహాధర్నా కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు ఆర్.క్రిష్ణయ్య, ఏపీ కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు, ఆంధ్ర రాష్ట్ర కురుబ సంఘం అధ్యక్షులు జబ్బల శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బిసీలు, కురుబలు ఎదుర్కొంటున్న సమస్యలను ధర్నాలో వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కురుబ సంఘం నాయకులు పాల్గొన్నారు.

జెఎన్‌టియు బోధనేతర సిబ్బంది బదిలీలు

ప్రజాశక్తి-అనంతపురం

వైస్ ఛాన్సలర్ జి.రంగజనార్ధన ఆదేశాల మేరకు స్థానిక జెఎన్‌టియు పరిధిలోని బోధనేతర సిబ్బందిని బదిలీ చేస్తూ రిజిస్ట్రార్ సి.శశిధర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సూపరింటెండెంట్ మహేష్‌ను కలికిరి ఇంజినీరింగ్ కళాశాలకు, అక్కడ పని చేస్తున్న సూపరింటెండెంట్ మురళీకృష్ణను పులివెందుల ఇంజినీరింగ్ కళాశాలకు, అనంతపురం ఇంజినీంగ్ కళాశాలలో పని చేస్తున్న సూపరింటెండెంట్ జనార్ధన్‌రెడ్డిని రీసెచ్ఛ్ డెవలప్‌మెంట్ కార్యాలయానికి, పులివెందుల సూపరింటెండెంట్ సునీల్‌కుమార్‌ను అనంత జెఎన్‌టియుకు ఉపకులపతి సెక్రటరీగా, అనంత జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల నుంచి సీనియర్ అసిస్టెంట్ కె.సుదర్శన్‌ను ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌కు, పులివెందులలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న పి.రాజేష్‌ను అనంత జెఎన్‌టియు ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌కు, సీనియర్ అసిస్టెంట్ పి. రాఘవేంద్రను పులివెందుల ఇంజినీరింగ్ కళాశాల నుంచి, అనంత జెఎన్‌టియు అకౌంట్ సెక్షన్‌కు, సీనియర్ అసిస్టెంట్ వి.రాఘవరెడ్డిను పులివెందుల ఇంజినీరింగ్ కళాశాల నుంచి జెఎన్‌టియు అకాడమిక్ ఆడిట్ కార్యాలయానికి, సీనియర్ అసిస్టెంట్ జి.శశికిరణ్‌ను పులివెందుల ఇంజినీరింగ్ కళాశాల నుంచి ఓటిపిఆర్‌ఐ కళాశాలకు, సీనియర్ అసిస్టెంట్ ఎన్.రవికుమార్‌ను అనంత జెఎన్‌టియు నుంచి పులివెందులకు, అనంత సీనియర్ అసిస్టెంట్ ఎస్.కుమారిను పులివెందుల ఇంజినీరింగ్ కళాశాలకు, సీనియర్ అసిస్టెంట్ సి.ముత్యాలును అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల నుంచి పులివెందుల ఇంజినీరింగ్ కళాశాలకు, సీనియర్ అసిస్టెంట్ గౌసియా నస్రీన్‌ను అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల నుంచి పులివెందుల ఇంజినీరింగ్ కళాశాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

స్పందనలో 283 అర్జీలు


ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు 283 అర్జీలు సమర్పించారు. అర్జీలను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా గత వారానికి ముందు దాదాపు నెలరోజుల పాటు స్పందన కార్యక్రమం నిర్వహించలేక పోయినప్పటికీ అర్జీలు పెండింగ్‌లో ఉండటం ఆందోళనకరమన్నారు. అర్జీదారుడితో మాట్లాడి సంతృప్తకర పరిష్కారాలు చూపాలన్నారు. ఒకసారి స్పందనలో అర్జీ ఇస్తే సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకం ప్రజలకు కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో గాయత్రిదేవి, జెడ్పీ సీఈవో భాస్కర్ రెడ్డి, ఆస్నెట్ సీఈవో కేశవనాయుడు, ఆర్డీవో మధుసూదన్ పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పుట్టపర్తిలో టెంపుల్‌జోన్ ప్రకటించాలి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

పట్టణంలోని సత్తెమ్మ గుడి నుంచి ఎనుములపల్లి గణేష్ సర్కిల్ వరకు టెంపుల్ జోన్ గా ప్రకటించాలని అఖిలపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఈనెల 1న సత్తెమ్మ గుడి వద్ద టీడీపీ వైసీపీ నాయకుల మధ్య జరిగిన రాజకీయ ఘర్షణలు వల్ల పుట్టపర్తి పవిత్రతను మంటగలిపారని అన్నారు. కేవలం రాజకీయ స్వార్థం కోసం ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తి పరువు గంగలో కలిపారని విమర్శించారు. ఏ పార్టీ వారైనా తమ రాజకీయ కార్యకలాపాలను ఎనుములపల్లి సర్కిల్ గణేష్ సర్కిల్ వద్ద జరుపుకోవచ్చని, ఇందుకు సంబంధించి కలెక్టర్ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. పుట్టపర్తిలో ఇలాంటి ఘర్షణ, యుద్ధ వాతావరణం ఇప్పటివరకు జరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిసిసి సభ్యులు కోటాసత్యం, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, చెన్నకేశవ నాయుడు, శామీర్, బిజెపి నాయకులు కొండమరాజు, కత్తి రాజారెడ్డి, తెలుగు యువత శామీర్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌తో మాట్లాడుతున్న నాయకులు



లోకేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డాక్టర్ కృష్ణమూర్తి

లోకేష్‌ను కలిసిన రిటైర్డ్ డాక్టర్

మడకశిర రూరల్ : ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల్లో లోకేష్ నిర్వహించిన యువగళం పాదయాత్రలో మడకశిర టిడిపి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు, రిటైర్డ్ డాక్టర్ కొంకల్ కృష్ణమూర్తి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన లోకేష్‌కు పుష్పగుచ్ఛం అందజేసి యువ గళం పాదయాత్రకు తన మద్దతు తెలిపారు. ఈసందర్భంగా మడకశిరలోని పలు సమస్యలను నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన చెప్పారు.

పౌష్టికాహార ఉత్సవాలు

మడకశిర రూరల్ : మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాల వద్ద పౌష్టిక ఆహార పక్షోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఐసిడిఎస్ సిబ్బంది సోమవారం నిర్వహించారు ఈ కార్యక్రమంలో మడకశిర సిడిపిఒ నాగమల్లేశ్వరి, గుడిబండ సిడిపిఒ పద్మావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిడిపిఓ నాగమల్లేశ్వరి మాట్లాడుతూ చిరుధాన్యాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు అరుణ, లీలావతి, కమల, అధ్యాపకులు అనిల్, కృష్ణా నాయక్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి

బత్తలపల్లి : ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు దృష్టి సారించాలని తహశీల్దార్ యుగేశ్వరిదేవి కోరారు. ప్రతి సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించే స్పందనలో ప్రజల నుంచి అందే వినతుల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. స్పందన కార్యక్రమాన్నిస్థానిక తహశీల్దార్ కార్యాలయంతో పాటు అన్ని గ్రామ సచివాలయాల్లో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీదేవి, ఏపీవో ఆదెప్ప, ఏపీఎం సుదర్శన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల నిర్వహణకు విరాళం

లేపాక్షి : ఈనెల6న హిందూపురంలో నిర్వహిస్తున్న అక్కమహాదేవి జయంతి ఉత్సవాలకు మండలం పరిధిలో ని కొండూరు గ్రామానికి చెందిన మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ మల్లికార్జున హిందూపురం వీరశైవ సంఘం ముఖ్య సలహాదారులు కొండూరు మల్లికార్జున విరాళం అందజేశారు. ఈసందర్భంగా సంఘం సభ్యులకు 10వేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు ముద్దమ్మ, రేణుక, త్రివేణి, మాల పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి విగ్రహం వితరణ

ఓబుళదేవరచెరువు : మండల కేంద్రానికి సమీపంలో ఎం. కొత్తపల్లి బండపై నిర్మించిన శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయానికి తహశీల్దార్ కునుకుంట్ల శ్రీధర్ శ్రీ మణికంఠస్వామివారి రాతిశిల మూలవిరాట్ విగ్రహం అందించినట్లు ఆలయ నిర్మాణ సంకల్పకులు పచ్చార్ల ఆంజనేయులునాయుడు తెలిపారు. పదేళ్ల క్రితం ఆలయం ఏర్పాటు చేసినప్పటి నుండి పంచలోహ అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న విషయం తెలుసుకొన్న తహశీల్దార్ ఆలయం విశిష్టత కోసం నల్లరాతిశిల మూలవిరాట్ విగ్రహాన్ని అందించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో రిటైర్డ్ టీచర్ రామచంద్రరెడ్డి, భక్తమండలి కార్యవర్గ సభ్యులు పిట్టా ప్రభాకర్ రెడ్డి, టైలర్ నిజాం, ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగిరెడ్డి గారి జయమ్మ, వీఆర్ఒలు రమణస్వామి, నరసింహులు,లోకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల వెల్లువ

పుట్టపర్తి రూరల్ : జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రాహూల్ దేవ్‌సింగ్ ఆధ్వర్యంలో సోమవార నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. కొంతమంది తమ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో పలుమార్లు అదే ఫిర్యాదుతో ఎస్పీ కార్యాలయం చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నట్లు తెలిపారు. కదిరి పట్టణానికి చెందిన వెంకటరమణ తన కుమార్తె వివాహానికి కదిరిలో ఉన్న బండారు రమేష్ వద్ద 2012లో రెండు లక్షల రూపాయల అప్పు తీసుకుని వడ్డీతో సహా రూ. 3.20 లక్షలు చెల్లించినా ఇంకా రూ. 2.46 లక్షలు ఇవ్వాలని రమేష్ ఒత్తిడి తీసుకువస్తున్నాడని బాధితుడు వెంకటరమణ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తాను చెల్లించిన సొమ్ము అంతా వడ్డీకే జమ వేశాడని తాను ఆయకం పెట్టిన స్థలాన్ని తిరిగి ఇవ్వమంటే మిగిలిన సొమ్ము చెల్లించాలని అంటున్నారని కన్నీరుమున్నీరు అయ్యారు. ఇలా పలువురు తమ సమస్యలను విన్నవించారు. పోలీసు పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని స్పందన ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని ఎస్పీ సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులకు ఎస్పీ ఫోన్‌లో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీ రామకృష్ణ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రేగుతున్న మట్టి మాఫియా



జెసిబితో మట్టిని ట్రాక్టర్ వేస్తున్న దృశ్యం

చెరువు మట్టి ట్రాక్టర్లతో అక్రమ రవాణా పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి మడకశిర రూరల్

మండలంలోని మట్టి మాఫియా పెట్రేగుతోంది. ఇష్టానుసారంగా అక్రమంగా చెరువు మట్టిని జెసిపి తో తవ్వకాలు జరిపి ట్రాక్టర్ల ద్వారా అక్రమ రవాణాకు పాల్పడుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండా జరుపుతున్న చెరువు మట్టి తవ్వకాలపై సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదన్న విమర్శలు వినపడుతున్నాయి. మండల పరిధిలోని ఎల్లోటి గ్రామ చెరువులో కొందరు వ్యక్తులు విచ్చలవిడిగా జెసిబి ద్వారా తవ్వించి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా రవాణా సాగిస్తున్నారు. ఇందుకు ఎలాంటి అనుమతులు లేకపోయినా తాము అనుమతులు తీసుకున్నామని చెప్పుకుంటూ పగలే మట్టి తవ్వకాలను జోరుగా కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి పడుతున్నా అధికారులు మాత్రం ఆవైపు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు వినపడుతున్నాయి. ఇప్పటికే 50 లోడ్లు మట్టిని తవ్వి ఓ ప్రైవేట్ కళాశాలకు తరలించామన పెనుగొండ నుండి తమకు పర్మిషన్లు ఉన్నాయని జెసిపి డ్రైవర్ స్వయంగా చెప్పడం గమనార్హం. మట్టి తవ్వకాలకు లోగోట్టుగా అధికారులు అనుమతులు ఇచ్చారని అందుకు తగిన ముడుపులు తీసుకున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా రోజు పదుల సంఖ్యలో రహదారిపై మట్టి ట్రాక్టర్లు తిరుగుతుండడంతో రహదారులు దెబ్బతిని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెరువు మట్టి అక్రమ తవ్వకాలకు అక్రమ రవాణాకు అడ్డుకట్టు వేయాలని స్థానకులు కోరుతున్నారు. మట్టి అక్రమ రవాణాపై ఎంపిడిఒ సోనియాబాయ్‌ను వివరణ కోరగా తాము ఎవరికి పర్మిషన్ ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు, నాడు నేడు పనులకు రోజుకు 2ట్రాక్టర్ల మట్టిని మాత్రమే రవాణా చేయడానికి అవకాశం ఉందన్నారు. మరుసటి రోజు కూడా కావాలంటే తిరిగి పర్మిషన్ తీసుకోవాల్సుంటుందనానరు. ట్రాక్టర్ నెంబరు వేసి పర్మిషన్ ఇస్తామన్నారు. ఇప్పటికైతే మట్టికి ఎవ్వరికి పర్మిషన్ ఇవ్వలేదని తెలిపారు.

చేనేతల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్



దీక్షలో మాట్లాడుతున్న చేనేత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలా రామాంజినేయులు

చేనేత సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలం చెందాయని ఏపీ చేనేత కార్మికసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రధానకార్యదర్శి జింకాచలపతి విమర్శించారు. చేనేతల సమస్యల పరిష్కారం కోసం చేనేత కార్మికసంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట 36 గంటల దీక్షను చేపట్టారు. ఈదీక్షలో చేనేత నాయకులు జింకాచలపతి, వెంకటస్వామి, రమణ, మంజునాథ్, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, చంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ దీక్షకు ఏపీ చేనేత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలా రామాంజినేయులు, సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్, నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత కార్మికుల హక్కులను కాపాడుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. 11 రకాల రిజర్వేషన్ చట్టం అమలు డిమాండ్‌లో స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్ ఎందుకు కాలయాపన చేసున్నారో అర్థం కావడంలేదన్నారు. రిజర్వేషన్ చట్టం అమలులో ఎమ్మెల్యే అడ్డంకులు తెలపడం దారుణమన్నారు. పవర్లూమ్ యాజమాన్యంతో ఎమ్మెల్యే కుమ్మక్కై జీవోను అమలుచేయడంలేదని ఆరోపించారు. చేనేత కార్మికుల ఆకలిచావులు, ఆత్మహత్యలు లేకుండా చేయాల్సిన బాధ్యత కలెక్టర్‌ది కాదా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎంపీ గోరంట్ల మాధవ్ ఇప్పటివరకు చేనేత కార్మికులకు చేసింది శూన్యమన్నారు. భవిష్యత్తులో చేనేతకార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటే ఎమ్మెల్యేనే బాధ్యత వహించాలన్నారు. చేనేత సమస్యలు పరిష్కరించకుంటే ఎమ్మెల్యే ఇంటిముందు,కలెక్టర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ చేనేత కార్మికసంఘం తాలూకా కార్యదర్శి వెంకటనారాయణ, పట్టణ కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు.

చేనేత దీక్షకు జనసేన మద్దతు : చేనేతల సమస్యలపై దీక్ష చేపడుతున్న చేనేత నాయకులకు జనసేన పార్టీ రాష్ట్రప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి తన మద్దతుతెలిపారు. ఈ సందర్భంగా చిలకం మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేనేత రంగం పూర్తిగా సంక్షోభంలోకి కూరుకుపోయిందన్నారు. గతంలో వస్తున్న పథకాలను వైసీపీ రద్దు చేసి కార్మికుల పొట్టను కొట్టిందని విమర్శించారు.

అవినీతి అధికారుల్లో మార్పు తీసుకొస్తా



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఫుడ్ కమిటీ ఛైర్మన్

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర వ్యాప్తంగా అవినీతి అధికారుల్లో మార్పును తీసుకు రావాడమే తన లక్ష్యమని దానికి అనుగుణంగా కమిషన్ పని చేస్తున్నదని రాష్ట్ర ఫుడ్ కమిటీ ఛైర్మన్ సిహెచ్ విజయ్ ప్రతాప్ రెడ్డి అన్నారు. సోమవారం శ్రీ సత్య సాయి జిల్లాలోని హిందూపురం పట్టణం, రూరల్ మండలంతో పాటు లేపాక్షి, పరిగి మండలాల పరిధిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేసి జాతీయ స్థాయిలో మొదటి స్థానంలోకి తీసుకు రావడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ప్రతి అధికారి మార్పు తెచ్చుకుని ప్రభుత్వం అందించే ప్రతి ఒక్కటి లబ్దిదారులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్ కమిటీ కమిషన్ మెంబర్ డిడి సురేష్, జిల్లా పౌరసరఫరాల అధికారి వంశీకృష్ణారెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ జిల్లా అధికారి అశ్వర్థనారాయణ, సాంఘిక సంక్షేమ శాఖ డిడిలు శివనారాయణ, మాధవి, అశోక్ బాబు, లీగల్ మెట్రాలజీ మహమ్మద్ గౌస్, ఫుడ్ సేఫ్టీ అధికారులు రామచంద్ర, తస్లీమ్‌తో పాటు స్థానిక సిఎస్‌డిటి హారతి, వన్‌టౌన్ సిఐ ఈరన్న, సిడిపిఒ రెడ్డమ్మతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

లేపాక్షి : మండలం కేంద్రంలోని కస్తూరి బా పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ చౌక ధాన్యపు కేంద్రాన్ని రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయ్ ప్రతాప్ రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కస్తూరి బా పాఠశాల లో సిబ్బంది స్థానికంగా ఉండటం లేదని, పిల్లలకు ఇచ్చే కోడి గుడ్లను బయటకు తీసుకెళుతున్నారని ఫిర్యాదు అందడంతో ఆ విషయాలపై విచారణ చేశారు. సిబ్బంది పద్ధతి మార్చు కోవాలని హెచ్చరించారు. అంగన్వాడీలో నెలకొన్న సమస్యపై ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మి కుమారితో మాట్లాడారు. కస్తూరి బా పాఠశాలలో పిల్లలకు తానే స్వయంగా పులిహోరాను వడ్డించారు. సరుకుల నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కాటం బాబు, ఎంఇఒ నాగరాజు నాయక్, సిడిపిఒ రెడ్డి రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పరిగి : విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని తద్వారా పౌష్టికాలు మెరుగ్గా ఉండే విద్యార్థుల్లో ఇటు విద్యాపరంగా ఆటు ఆరోగ్యపరంగాను మెరుగ్గా ఉంటారని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయ్ ప్రతాప్ రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం పరిగి మండలంలోని మోడా జడ్పీహెచ్ఎస్, ఏపీ ఆర్ఎస్ ఎక్సెన్స్ పాఠశాల, అంధుల పాఠశాల, బీసీ హాస్టల్‌ను ఆయన తనిఖీ చేశారు ఎపిఆర్ ఎస్ పాఠశాలలో భోజన పంపిణీలో నాణ్యత పాటించడం లేదనిస్థానిక వైసిపి నాయకులతో పాటు కొంతమంది విద్యార్థులు తల్లిదండ్రులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎంఇఒ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వివాహిత ఆత్మహత్య

లేపాక్షి : మండలం పరిధిలోని కల్లూరు గ్రామానికి చెందిన వివాహిత సోమవారం ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామానికి చెదిన ప్రతిమ (43) తన ఇంటి వరండాలో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. మృతు రాలికి భర్త నరేంద్ర, ఇద్దరు కొడుకులు ఉన్నారు. ప్రతిమ కొన్ని సంవత్సరాలనుండి న్యూరో, ఆర్థో సమస్యలతో బాధ పడుతుండేదని స్థానికులు తెలిపారు. నరేంద్ర సోమవారం పట్టు గుళ్ళను వేసుకొని కర్ణాటక రాష్ట్రం చిల్లగట్ట మార్కెట్‌కు వెళ్లాడని కొడుకు పొలం వద్దకు వెళ్లడం తో ఇంట్లో ఎవరు లేని సమయంలో అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతిమ ఆత్మహత్యకు పాల్పడిందని చెప్పారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కర్నాటక మద్యం స్వాధీనం

చిలమత్తూరు : కర్నాటక అక్రమ మద్యాన్ని తరలిస్తున్న బాగేపల్లి కి చెందిన వ్యక్తిని అరెస్టు చేసిన మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మొరంపల్లి క్రాస్ జాతీయ రహదారి వద్ద నిందితుడిని అరెస్టు చేసి 267 కర్నాటక మద్యం ప్యాకెట్లు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

పుట్టపర్తి ఘటనలో ఇరువర్గాలపై కేసు

పుట్టపర్తి రూరల్ : మూడు రోజుల క్రితం టిడిపి, వైసిపి శ్రేణుల మధ్య పుట్టపర్తిలో సత్యమ్మ దేవాలయం వద్ద జరిగిన ఘర్షణలో ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు పుట్టపర్తి అర్బన్ పోలీసులు తెలిపారు. బహిరంగ ప్రాంతంలో ఘర్షణకు దిగి రాళ్ళ, చెప్పులు, టెంకాయలతో దాడులు చేసుకున్న సంఘటన దృశ్యాలను, వీడియో క్లిప్పింగులను పరిశీలించి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తోపాటు అతని అనుచరులు పదిమందిపైనా కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు. అంతేకాక ప్రస్తుతం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి తో పాటు అతని అనుచరులు పదిమందిపై కేసు నమోదు చేసినట్టు పుట్టపర్తి అర్బన్ పోలీసులు తెలిపారు. పుట్టపర్తి పట్టణంలో 30 యాక్ట్ అమల్లో ఉన్న కారణంగా ఎవరు ఎలాంటి సభలు, సమావేశాలు నిర్వహించరాదని పోలీస్ వర్గాలు ఆదేశాలు జారీచేసినా ఇరువర్గాలు నిబంధనలకు విరుద్ధంగా సత్యమ్మ దేవాలయం వద్ద రాళ్ళ, చెప్పులతో దాడులు చేసుకోవడంపై సీరియస్ గా తీసుకొన్న పోలీసులు భవిష్యత్తులో పుట్టపర్తి పవిత్రతకు భంగం కలగకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ

పోలీస్ స్టేషన్ తనిఖీ

గాండ్లపెంట : స్థానిక పోలీస్ స్టేషన్‌ను సత్యసాయి జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ సోమవారం తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఆయన రికార్డులు పరిశీలించారు. పెండింగ్లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని ఎస్ఐ బి. మల్లికార్జున్ రెడ్డిని ఆదేశించారు. అలాగే పదవ తరగతి పరీక్షల నిర్వహణ, కటారుపల్లి యోగివేమన బ్రహ్మోత్సవాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కదిరి డీఎస్పీ భవ్య కిషోర్, కదిరి రూరల్ సిఐ శంకర్ నాయక్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలంకు ప్రత్యేక బస్సు

హిందూపురం : ఏప్రిల్ 6న పౌర్ణమి సందర్భంగా అరుణాచలం గిరి ప్రదక్షిణ కోసం స్థానిక డిపో నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు సర్వీసును ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా డిఎం మాట్లాడుతు బస్సు ఏప్రిల్ 5 న సాయంత్రం 5 గంటలకు హిందూపురంలో బయలుదేరి ఏప్రిల్ 6 న ఉదయం 3 గంటలకు అరుణాచలం చేరుతుందన్నారు. గిరి ప్రదక్షిణ తర్వాత మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి శ్రీపురం గోల్డెన్ టెంపుల్, కాణిపాకం శ్రీ సిద్ది వినాయకుని దర్శించుకొని మరుసటి రోజు 4 గంటలకు హిందూపురం చేరుతుందన్నారు. టికెట్టు ధర ఒక్కొక్కరికి సూపర్ లగ్జరీ బస్సుకు రూ.1320 (రిజర్వేషన్‌తో కలిపి) గా నిర్ణయించామన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదనపు సమాచారం కోసం 7382863007, 9959225858, 8977225997 నంబర్లను సంప్రదించాలని డిపో మేనేజర్ శ్రీనివాస రావు తెలిపారు.

ఉపాధి సిబ్బందితో సమీక్ష

నల్లచెరువు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో ఎంపీడీవో శకుంతల సమీక్ష నిర్వహించారు. మండల పరిధిలోని 13 గ్రామాలలో గల కూలీలను ఉపాధి హామీ పనులకు సిద్ధం చేయాలన్నారు. కూలీలను రోజు వారి వేతనం రూ. 272 పడేటట్టు కొలతలు ఇవ్వాలన్నారు. గ్రామాలలో కూలీలకు అవగాహన కల్పించి ఉపాధి హామీ పనులలో పెద్ద ఎత్తునపాల్గొనే విధంగా క్షేత్రస్థాయిలో ఉన్న ఉపాధి హామీ సిబ్బంది అధికారులు సమిష్టిగా కృషిచేయాలన్నారు. ఈ సమావేశంలో ఏపీవో మంజుల, ఫీల్, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ

మురుగు కదలదు ... దుర్వాసన వదలదు..!

పట్టించుకోని పాలకులు, అధికారులు

ప్రజాశక్తి - మడకశిర



చెత్త చెదారంతో నిండిన డ్రయినేజీ

పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా మడకశిర నగర పంచాయతీ పరిస్థితి తయారైంది. ఈ నగర పంచాయతీలో మురుగు కాలువ వ్యవస్థను గత ప్రభుత్వ కాలంలో కోట్లాది రూపాయలు వెచ్చించి అస్తవ్యస్తంగా నిర్మించి వదిలివేశారు. దీంతో పట్టణంలో ప్రధానంగా కాలువల్లో మురుగునీరు సులువుగా ప్రవహించే వీలు లేకుండా ఎక్కడికక్కడ పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. అంతేకాక మురుగునీరు నిలువ ఉండడంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. మురుగు నీరు కాలువ నిండి రోడ్లపై కూడా పొంగిపొర్లుతోంది. ఇంత జరుగుతున్నా పాలకవర్గ సభ్యులు కానీ నగర పంచాయతీ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినపడుతున్నాయి. ప్రధానంగా కౌన్సిలర్లు నివాసమున్న కాలనీల్లో మాత్రం వారానికి రెండుసార్లు మురికి కాలువలను శుభ్రం చేస్తూ మిగిలిన ప్రాంతాలను పట్టించుకోవటం లేదన్న ఆరోపణలు వినపడుతున్నాయి. మార్చి 31న జరిగిన పాలకవర్గ సమావేశంలో పట్టణంలోని డ్రయినేజీ వ్యవస్థ గురించి ఏ ఒక్క సభ్యుడు ప్రస్తావించిన పాపాన పోలేదు. దీన్నిబట్టి చూస్తే సభ్యులకు ప్రజాసమస్యలపై ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం అవుతోంది. వేసవికాలం ప్రారంభమైనప్పటికీ తాగునీటి సమస్యపై కూడా స్పందించకపోవటం దారుణమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని హిందూపురం బస్టాండ్ వద్ద డ్రయినేజీ పేరుకుపోవటంతో ఆ ప్రాంతంలో దుర్గంధం వెదజల్లుతోంది. ఇక్కడ ఐదు నిమిషాలు నిలబడే పరిస్థితి కూడా లేదు. ప్రధాన కూడలి లోనే మురుగుకాలువలు శుభ్రం చేయించలేనిమున్సిపల్ అధికారులు పన్నుల వసూళ్లకు మాత్రం ఎగబడతారని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా శివాపురం, పావుగడ రోడ్డులో ఆర్టీసీ బస్టాండ్ వద్ద, స్టేట్ బ్యాంకు వద్ద, మారుతి నగర్, తదితర చోట్ల మడుగులను తలపిస్తున్న మురుగునీటితో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి మురుగునీటి కాలువలను శుభ్రచేయించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

ప్రజాశక్తి- హిందూపురం



పరీక్ష కేంద్రం వద్ద వేచి ఉన్న విద్యార్థులు

పది పరీక్షలు ప్రశాంతంగా సోమవారం నుంచి ప్రారంభం అయ్యాయి. మొత్తం పట్టణం, రూరల్ మండలంలో 13 పరీక్షా కేంద్రాల్లో 3380 మంది విద్యార్థులు హాజరు కావాల్సుండగా 29 మంది విద్యార్థులు గైర్హాజరైనటుల మండల విద్యాశాఖ అధికారి గంగప్ప తెలిపారు. పట్టణంలో, రూరల్ మండలంలో 7 పరీక్ష కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్ నాగరాజు పరిశీలించారు. ఎండలు ఎక్కువ ఉండడంతో పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు.

బత్తలపల్లి : బత్తలపల్లిలోని మూడు కేంద్రాలలో నిర్వహించిన పదోతరగతి పరీక్షలను సజావుగా జరిగాయి. మూడు కేంద్రాల్లో 483 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 478 మంది హాజరైనట్లు ఎంఇఒ చాముండేశ్వరి తెలిపారు. పరీక్షా కేంద్రాలను తహశీల్దార్ తదితరులు తనిఖీ చేశారు.

గాండ్లపెంట : పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బుక్కపట్నం : మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. రెండు పరీక్ష కేంద్రా లలో పరీక్షలు నిర్వహించగా 390 మంది విద్యార్థులకు గాను 385 మంది హాజరయ్యారు. మొదటి రోజు పరీక్ష కేంద్రాలను అసిస్టెంట్ కమిషనర్ నాగరాజు, తహశీల్దార్ నటరాజ్, ఎంఇఒ గోపాల్ నాయక్ తదితరులు తనిఖీ చేశారు.

కొత్తచెరువు : కొత్త చెరువులోని జిల్లా పరిషత్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలు, శ్రీవిద్య పాఠశాలలో పదోతరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు డివైఇఒ రంగస్వామి ఫ్లయింగ్ స్క్వాడ్ నాగరాజు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ వెంకటరమణా నాయక్ హెచ్ఎం సుమన, చెన్నకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అగళి : పదవ తరగతి పరీక్షలు సజావుగా ప్రారంభమైనాయి మండలంలోని ఐదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కెజిబివి విద్యార్థులు మొత్తం 536 మంది పరీక్షకు అయ్యారు. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రెండు రోజులు ముందే విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ చేశారు .ఆగలి ఎంఇఒ గోపాల్ పరీక్ష రాసే విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. 30 నిమిషాల ముందే విద్యార్థులు పరీక్ష సెంటర్లకు చేరుకున్నారు. సబ్ ఇన్స్‌పెక్టర్ లావణ్య ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

రొద్దం : సోమవారం నిర్వహించిన పదవ తరగతి పరీక్షలు మండలంలో సజావుగా జరిగాయి. మండల కేంద్రంలో మూడు సెంటర్లలో పరీక్షలు నిర్వహించారు. అయితే మండలంలో కొన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం లేక విద్యార్థులు సమయానికి హాజరు కావడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సు సౌకర్యం లేకపోటంతో రాచూరు గ్రామానికి చెందిన స్వాతి అనే విద్యార్థిని 9 :29 గంటలకు పరీక్షకేంద్రంలోకి వెళ్లంది. విద్యార్థిని వెంట ఆమె తల్లి కూడా పరుగులు పెట్టి కూతురికి సాయం చేసింది. ఈ పరీక్షలను తహశీల్దార్ అనంతచారి, ఎంపిడిఒ రాబర్ట్ విల్సన్ తదితరులు పరిశీలించారు.

గోరంట్ల : మండల కేంద్రంలో ఏడు సెంటర్లలో సోమవారం జరిగిన పదో తరగతి పరీక్షలను తహశీల్దార్ రంగనాయకులు తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై పరిశీలించారు.

కదిరి టౌన్ : పదో తరగతి పరీక్షలు తొలిరోజు సజావుగా జరిగాయి.కదిరి మండల వ్యాప్తంగా 2009 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు ఎంఇఒ చెన్నకృష్ణ తెలిపారు. పరీక్షా కేంద్రాలను కదిరి ఆర్డీవో రాఘవేంద్ర తనిఖీ చేశారు.